


# మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

RNI Number
TELTEL/2023/85680



రిపోర్టర్లు కావలెను
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
మన దునియా
9490056011,9603969335



సంపుటి : 4 | సంచిక : 21 | సెప్టెంబర్ 26 శనివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


# సీఎం రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ మోహమ్మద్' ఉత్తమ ప్రజాసేవ అవార్డు



- కేరళలోని నీలంబూరులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా అవార్డు
- తెలంగాణలో సంక్షేమ పథకాలకు గుర్తింపుగా ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వెల్లడి
- మతతత్వ శక్తులను వ్యతిరేకించడమే నిజమైన నివాళి అని పేర్కొన్న రేవంత్
- కేంద్ర ప్రభుత్వంపై ఓట్లు, పార్టీలు, నిధుల దొంగతనం అంటూ తీవ్ర విమర్శలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ మొహమ్మద్ ఉత్తమ ప్రజాసేవ పురస్కారం-2026' అందుకున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేరళ మాజీ మంత్రి దివంగత ఆర్యదాన్ మొహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం కేరళలోని నీలంబూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చేతుల మీదుగా రేవంత్ రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.తెలంగాణలో రైతులు, బడుగు బలహీన వర్గాలు, సామాన్య ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమ, ప్రజాస్వామ్య విలువల పట్ల ఉన్న నిబద్ధతను గుర్తించి ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆర్యదాన్ మొహమ్మద్ ఫౌండేషన్ ప్రకటించింది. ఈ అవార్డు కింద లక్ష రూపాయల నగదు బహుమతి, ప్రశంసాపత్రం,

(మిగతా 2వ పేజీలో..)

## పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు: మంత్రి ఉత్తమ్

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు

రాష్ట్రంలో మొత్తం 1.06 కోట్ల రేషన్ కార్డులు---3.42 కోట్ల మందికి ఆహార భద్రత

27, 28 తేదీల్లో హుజూర్‌నగర్, మిర్యాలగూడ, సూర్యాపేటలో మంత్రి ఉత్తమ్ విస్తృత పర్యటన

**మన దునియా,హైదరాబాద్,సెప్టెంబర్ 25**

రాష్ట్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న గత బీఆర్ఎస్---అప్పటి టీఆర్ఎస్---ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా మంజూరు చేయకుండా పేద, మధ్యతరగతి కుటుంబాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిందని రాష్ట్ర నీటిపారుదల, ఆహార మరియు పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కొత్తగా కుటుంబాలు ఏర్పడినప్పటికీ,

(మిగతా 2వ పేజీలో..)



## ఈ-కేవైసీ పూర్తయితేనే పీఎం కిసాన్ నిధులు!

మూడు మార్గాల్లో పూర్తి చేసుకునే వెసులుబాటు

**మన దునియా,న్యూఢిల్లీ:సెప్టెంబర్ 25**

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 24వ విడతగా రూ.2,000 పొందాలంటే లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాల్సిందేనని స్పష్టమైంది. గతంలో 23వ విడత సమయంలో ఈ ప్రక్రియ పూర్తి చేయని వారి ఖాతాల్లో నగదు జమ కాలేదు. ప్రస్తుతం అధికారిక పోర్టల్‌లో సాధారణ రైతులకు నేరుగా కేవైసీ చేసుకునే అవకాశం అందుబాటులో

(మిగతా 2వ పేజీలో..)



## యూపీఐ చెల్లింపులపై వినియోగదారులకు పైసా భారం లేదు: కేంద్ర మంత్రి నిర్మలమ్మ!

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 25**

యూపీఐ డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ ఎండీఆర్ చార్జీలు విధింపులపై దేశవ్యాప్తంగా సాగు తున్న ప్రచారానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తెరదించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆమె ఈ అంశంపై సాధారణ వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందవలసిన పని లేదని దీనివల్ల ఖాతాదారులపై పైసా భారం కూడా పడబో దని తేల్చిచెప్పారు.రూ.2,000కు మించిన కొన్ని నిర్దిష్ట డిజిటల్ లావాదేవీ లకు ఎండీఆర్ వర్తించినా, అది వినియోగదారులకు కాదని, వ్యాపారులకే పరిమితమని మంత్రి చెప్పారు.ఎండీఆర్ అనేది కేంద్ర ప్రభుత్వం వసూలు చేసే పన్ను, సెస్ లేదా సర్‌చార్జ్ కాదని...

(మిగతా 2వ పేజీలో..)




## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి... ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

హుస్సేన్‌సాగర్‌లో ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం పూర్తి

69 అడుగుల పంచముఖ గణపతిగా దర్శనమిచ్చిన విగ్రహం

క్రేన్ నంబర్ 4 వద్ద మధ్యాహ్నం 2.15 గంటలకు నిమజ్జనం

పటిష్ఠ బందోబస్తు నడుమ ప్రశాంతంగా ముగిసిన వేడుక

హైదరాబాద్‌లోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జన వేడుకలు

(మిగతా 2వ పేజీలో..)



## హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం.. రేపు ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ గచ్చిబౌలిలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ విగ్రహం ఏర్పాటు

ఆయన జయంతి సందర్భంగా శనివారం ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి

ఆయన నాయకత్వంలోనే ఉపాధి హామీ, ఆర్టీఐ వంటి చట్టాలు వచ్చాయని వెల్లడి

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ పాత్ర చారిత్రాత్మకమని కొనియాడిన

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా

మన అక్షరం – మన ప్రపంచం

## యూపీఐ చెల్లింపులపై వినియోగదారులకు పైసా భారం లేదు: కేంద్ర మంత్రి నిర్మలమ్మ!

(మొదటి పేజీ తరువాయి)

ఆ మొత్తం ప్రభుత్వ ఖజానాకు వెళ్లదని స్పష్టం చేశారు. బ్యాంకులు, పేమెంట్ గేట్‌వేలు వంటి డిజిటల్ చెల్లింపు వ్యవస్థ నిర్వహణకు సంబంధించిన ఖర్చుల కోసం ఈ రుసుము ఉంటుం దని వివరించారు. ఎండీఆర్ నిబంధన లపై అవగాహన లోపం వల్లే అనవసర అపోహలు వ్యాపిస్తు న్నాయని అన్నారు. ఇప్పటికే డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా జరిగే చెల్లింపుల్లో వ్యాపారులు ఇలాం టి రుసుములను భరిస్తున్నారని గుర్తుచేశారు. యూపీఐ చెల్లింపుల విషయంలోనూ ఈ చార్జీని కస్టమర్లపైకి నెట్టే అవకాశం ఉండదని మంత్రి తేల్చిచెప్పారు. డిజిటల్ చెల్లింపు లను ఉపయోగించే ప్రజలకు సేవలు ఉచితంగానే, ఎప్ప టిలాగే అంతరాయం లేకుండా అందుబా టులో ఉంటాయని తెలిపారు. తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు గందరగోళా నికి గురికావొద్దని సూచించారు.

## ఈ–కేవైసీ పూర్తయితేనే పీఎం కిసాన్ నిధులు!

(మొదటి పేజీ తరువాయి)

లేకపోవడంతో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మూడు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా ఈ ప్రక్రియను ముగించవచ్చని అధికారులు వెల్లడించారు.

సీఎస్‌సీ కేంద్రాల ద్వారా:

గ్రామాల్లోని కామన్ సర్వీస్ సెంటర్ల (జూజ) వీఎల్‌ఈ లాగిన్ ద్వారా ఆధార్ కార్డు, పీఎం కిసాన్ రిజిస్ట్రేషన్ వివరాలు అందించి బయోమెట్రిక్ విధానంలో కేవైసీ చేసుకోవచ్చు. దీనికి ప్రభుత్వం నిర్దేశించిన నామమాత్రపు రుసుము మాత్రమే చెల్లించాలి.

లిమొబైల్ ఫేస్ రికగ్నిషన్:లిస్మార్ట్‌ఫోన్ వినియోగదారులు ప్లేస్టోర్ నుంచి 'పీఎం కిసాన్'తో పాటు 'ఆధార్ ఫేస్ ఆర్‌డీ' యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి. పీఎం కిసాన్ యాప్‌లో బెనిఫిషియరీగా లాగిన్ అయి, 'ఫేషియల్ ఈ–కేవైసీ' ఎంపిక చేసుకుని కెమెరా ద్వారా ముఖాన్ని స్కాన్ చేసి క్షణాల్లో కేవైసీ పూర్తి చేయవచ్చు. అధికారిక లాగిన్ల ద్వారా: క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ, స్థానిక ప్రభుత్వ సిబ్బంది వద్ద ఉండే అధికారిక స్పెషల్ లాగిన్ల సాయంతోనూ పెండింగ్ కేవైసీని పూర్తి చేసుకునే సదుపాయం ఉంది.

మధ్యవర్తులను నమ్మొద్దు..గ్రామీణ ప్రాంతాల్లో కేవైసీ పేరుతో కొందరు దళారులు రైతుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. గుర్తుతెలియని వ్యక్తులకు ఎలాంటి నగదు ఇవ్వొద్దని, అధికారిక మార్గాల్లోనే ఉచితంగా లేదా ప్రభుత్వ నిబంధనల మేరకే రుసుము చెల్లించి ప్రక్రియను పూర్తి చేసుకోవాలని హెచ్చరించారు.

## గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహాగణపతి... ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

(మొదటి పేజీ తరువాయి)

శుక్రవారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా భక్తులకు దర్శనమిచ్చిన స్వామివారి విగ్రహాన్ని వేలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేశారు. ఉదయం 9.30 గంటలకు ఖైరతాబాద్ నుంచి మహాగణపతి శోభాయాత్ర వైభవంగా ప్రారంభమైంది. యాత్ర ప్రారంభంలో దానం నాగేందర్ గణనాథుడి ఎదుట డ్యాన్స్ చేసి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. 'గణపతి బప్పా మోరియా' అంటూ భక్తులు చేసిన నినాదాలతో పరిసర ప్రాంతాలన్నీ మార్మోగాయి. ఈ శోభాయాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది.ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన క్రేన్ నంబర్ 4 వద్దకు విగ్రహాన్ని చేర్చిన అనంతరం, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటలకు భారీ క్రేన్ల సహాయంతో విగ్రహాన్ని సాగరంలో నిమజ్జనం చేశారు. తమ ఆరాధ్య దైవమైన గణనాథుడికి భక్తులు అశ్రునయనాలతో ఘనంగా వీడ్కోలు పలికారు. పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిమజ్జన ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది.

## స్టాలిన్ గారూ, ఈ కేసుపై నోరు విప్పండి: సీఎం విజయ్ ఆగ్రహం

తమిళనాడు రాజకీయాలు మరోసారి రసవత్తరంగా మారాయి. ప్రముఖ గ్రానైట్ వ్యాపారి ఆర్. వీరమణిపై నమోదైన లైంగిక వేధింపుల కేసు విషయంలో ముఖ్యమంత్రి విజయ్, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "స్టాలిన్ గారూ, ఈ ఉదంతంపై మీ మౌనాన్ని వీడండి" అంటూ డిమాండ్ చేశారు.అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విజయ్, డీఎంకే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "2025 అక్టోబర్‌లో, డీఎంకే హయాంలోనే ఈ కేసుకు సంబంధించి ఫిర్యాదు అందినప్పటికీ, వారు నిందితులను రక్షించేందుకు వాస్తవాలను తారుమారు చేశారు. తగిన ఆధారాలు లేవనే సాకుతో కేసును మూసివేశారు" అని విజయ్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో డీఎంకే, ఏఐఏడీఎంకే పరస్పరం సహకరించుకున్నాయని, అందుకే ఆ రెండు పార్టీలు నోరు మెదపడం లేదని విమర్శించారు. తన తల్లిని విమర్శించినా సహిస్తానని, కానీ తమిళనాడులోని మహిళా లోకాన్ని అవమానిస్తే ఊరుకోనని స్పష్టం చేశారు. డీఎంకే శ్రేణులు, వారి కుటుంబ సభ్యులు ఇటువంటి అనైతిక చర్యలను ప్రోత్సహిస్తున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలతో జెమ్ గ్రానైట్స్ చైర్మన్ ఆర్. వీరమణితో పాటు, ఆయనకు సహకరించిన శాంతి, మహేంద్ర సింహన్‌లను 2026 ఆగస్టులో పోలీసులు అరెస్టు చేశారు. 2025లో ఓ సామాజిక కార్యకర్త విడుదల చేసిన వీడియో ఫుటేజ్‌తో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ప్రస్తుత టీవీకే ప్రభుత్వ హయాంలో ప్రత్యేక పోక్సో కోర్టు గతంలోని క్లోజర్ రిపోర్ట్‌ను తిరస్కరించి, పునర్విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో పోలీసులు బాధితులను గుర్తించి, వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతుండగా, టీవీకే, డీఎంకే మధ్య ఇది ప్రధాన రాజకీయ పోరాటంగా మారింది.



## పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు: మంత్రి ఉత్తమ్

(మొదటి పేజీ తరువాయి)

కుటుంబ సభ్యుల సంఖ్య పెరిగినప్పటికీ, లక్షలాది మంది అర్హులు దరఖాస్తులు చేసుకున్నప్పటికీ గత ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోలేదని అన్నారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆహార భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తాను పౌర సరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా చేపట్టామని చెప్పారు.2025 జనవరి 1 నాటికి రాష్ట్రంలో 89,95,282 రేషన్ కార్డులు ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 16,32,810 కొత్త రేషన్ కార్డులను మంజూరు చేశామని తెలిపారు. ఈ కొత్త కార్డుల ద్వారా మరో 61,09,544 మందికి ఆహార భద్రత కల్పించామని పేర్కొన్నారు. పాత, కొత్త కార్డులు కలిపి ప్రస్తుతం తెలంగాణలో మొత్తం 1,06,28,092 రేషన్ కార్డులు ఉన్నాయని, వీటి ద్వారా 3,42,57,109 మంది ప్రజలు ప్రయోజనం పొందుతున్నారని వివరించారు.రాష్ట్రంలోని దాదాపు ప్రతి కుటుంబానికీ ఆహార భద్రత కల్పించే స్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రేషన్ కార్డు అనేది కేవలం బియ్యం పొందడానికి ఉపయోగపడే పత్రం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు ఆహార భద్రతతోపాటు అనేక సంక్షేమ పథకాలను అందించే కీలకమైన ఆధారమని చెప్పారు. ప్రతి అర్హ కుటుంబానికీ రేషన్ కార్డు అందించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులందరికీ ప్రతి వ్యక్తికి నెలకు ఆరు కిలోల చొప్పున నాణ్యమైన సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని మంత్రి తెలిపారు. పేద ప్రజలు కూడా గౌరవంగా నాణ్యమైన బియ్యం తినాలన్న ఉద్దేశంతో దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెలా సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు.ఈ భారీ సంక్షేమ కార్యక్రమంలో భాగంగానే తన సొంత నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌తోపాటు పొరుగున ఉన్న మిర్యాలగూడ నియోజకవర్గంలోనూ లబ్ధిదారులకు రేషన్ కార్డులను స్వయంగా పంపిణీ చేయనున్నట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.సెప్టెంబర్ 27, ఆదివారం ఉదయం మంత్రి హైదరాబాద్ నుంచి బయలుదేరి నేరేడుచర్లకు చేరుకుంటారు. అక్కడ పాలకీడు, నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేస్తారు. అనంతరం పాలకీడు మండలం ముసిఒడ్డు సింగారం గ్రామంలో ?1.80 కోట్లతో నిర్మించిన ముసిఒడ్డు సింగారం––రోళ్లవారిగూడెం బీటీ రోడ్డును ప్రారంభిస్తారు.హుజూర్‌నగర్ పట్టణంలో జరిగే కార్యక్రమంలో హుజూర్‌నగర్ పట్టణం, మండలంతోపాటు మఠంపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు రేషన్ కార్డులు, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తారు. అనారోగ్యం, ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసాగా నిలుస్తోందని మంత్రి పేర్కొన్నారు.తదుపరి మేళ్లచెరువు మండలం కందిబండ గ్రామంలో ?2.80 కోట్లతో నిర్మించిన వంతెనను ప్రారంభిస్తారు. కప్పలకుంట తండాలో ?30 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలు, వెల్లటూరు ఆర్ అండ్ ఆర్ కాలనీలో ?10 లక్షలతో, వేపల మాధవరంలో ?10 లక్షలతో నిర్మించిన విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలను ప్రారంభిస్తారు.మేళ్లచెరువులో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలువపై ?3 కోట్ల వ్యయంతో నిర్మించిన మూడు వంతెనలను మంత్రి ప్రారంభిస్తారు. అనంతరం మేళ్లచెరువు, చింతలపాలెం మండలాల లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తారు. చింతలపాలెం మండలం కొత్తగూడెం, గాంధీనగర్ తండాల్లో ఒక్కొక్కటి ?20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభిస్తారు.సెప్టెంబర్ 28, సోమవారం గరిడేపల్లి మండలం కొండాయిగూడెంలో ?10 లక్షలతో నిర్మించిన మహిళా స్వయం సహాయక సంఘం భవనాన్ని, రెగ్యులగడ్డ తండాలో ?30 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ, స్వయం సహాయక సంఘం భవనాలను మంత్రి ప్రారంభిస్తారు. అనంతరం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చేరుకుని అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తారు.ఈ రెండు రోజుల పర్యటనలో మొత్తం ?8.90 కోట్ల విలువైన రహదారులు, వంతెనలు, గ్రామపంచాయతీ, విలేజ్ ఆర్గనైజేషన్, స్వయం సహాయక సంఘాల భవనాలను మంత్రి ప్రారంభించనున్నారు. గ్రామీణ రహదారులు, రవాణా సౌకర్యాలు, మహిళా సంఘాల మౌలిక వసతులు, గ్రామ పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే ఈ అభివృద్ధి పనుల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.మిర్యాలగూడ కార్యక్రమం అనంతరం మంత్రి సూర్యాపేటకు చేరుకుని భారత ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వ్యవహార శైలికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించే నిరసన కార్యక్రమంలో పాల్గొంటారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం ఉండాలంటే ఎన్నికల సంఘం పూర్తి నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి ఓటుకు సమానమైన విలువ ఉందని, ప్రజల ఓటు హక్కును, ఎన్నికల ప్రక్రియ పవిత్రతను కాపాడటం ప్రతి ప్రజాస్వామ్యవాది బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగ సంస్థలు అధికార పార్టీలకు అనుకూలంగా కాకుండా దేశ ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, ఓటు హక్కును రక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ చేపట్టే పోరాటంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## హైదరాబాద్‌లో మన్మోహన్ సింగ్ విగ్రహం.. ఆవిష్కరించనున్న సీఎం రేవంత్ రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం

మాజీ ప్రధానమంత్రి, ప్రముఖ ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. నగరంలోని ఐటీ కారిడార్ అయిన గచ్చిబౌలి విప్రో సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం (సెప్టెంబరు 26) ఆవిష్కరించనున్నారు.ఈ కార్యక్రమ ఏర్పాట్లను హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ విగ్రహం కేవలం ఒక స్మారక చిహ్నం కాదని, దేశ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ పోషించిన పాత్ర, ఆయన ఆర్థిక దార్శనికత, నిస్వార్థ ప్రజాసేవ, నిరాడంబర నాయకత్వ లక్షణాలను భవిష్యత్ తరాలకు గుర్తుచేసే ఒక శాశ్వత ప్రతీక అని ఆయన అభివర్ణించారు.మన్మోహన్ సింగ్ పేరు భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పొన్నం కొనియాడారు. 1991లో ఆర్థిక మంత్రిగా ఆయన ప్రారంభించిన సంస్కరణలు భారత ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు బాటలు వేశాయని గుర్తుచేశారు. 2004 నుంచి 2014 వరకు ప్రధానమంత్రిగా దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమం, ఆర్థిక స్థిరత్వం కోసం ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఆయన హయాంలోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టం వంటివి అమల్లోకి వచ్చాయని తెలిపారు. తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్ష అయిన ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో మన్మోహన్ సింగ్ కీలక పాత్ర పోషించారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. 2009లో ప్రక్రియ ప్రారంభించాలని నాటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం నుంచి 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ద్వారా తెలంగాణ రాష్ట్రం ఏర్పడే వరకు కేంద్రంలో మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం చారిత్రాత్మక పాత్ర పోషించిందని ఆయన వివరించారు. రాష్ట్ర ఏర్పాటులో యూపీఏ ప్రభుత్వం, మన్మోహన్ సింగ్ పాత్రను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా గుర్తించిందని ఆయన తెలిపారు. ప్రధానిగా మన్మోహన్ సింగ్ మార్గదర్శకత్వంలో ఎంపీగా పనిచేయడం తన రాజకీయ జీవితంలో గర్వకారణమని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి 'ఆర్యదాన్ మొహమ్మద్' ఉత్తమ ప్రజాసేవ అవార్డు

(మొదటి పేజీ తరువాయి)

జ్ఞాపికను అందజేశారు. ఎంపీ బెన్నీ బెహనాన్, కేరళ మంత్రి ఏపీ అనిల్ కుమార్, ప్రముఖ మేధావి కల్పేట నారాయణన్ సభ్యులుగా ఉన్న జ్యూరీ రేవంత్ రెడ్డిని ఈ పురస్కారానికి ఎంపిక చేసింది.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు లౌకిక శక్తులన్నీ ఏకం కావాలని పిలుపునిచ్చారు. మతతత్వ శక్తులను వ్యతిరేకించడమే ఆర్యదాన్ మొహమ్మద్‌కు అసలైన నివాళి అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశంలో ఓట్ల దొంగతనం, పార్టీల దొంగతనం, నిధుల దొంగతనం జరుగుతోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం దేశ యువత భవిష్యత్తును దొంగిలిస్తోందని విమర్శించిన ఆయన, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాంగ వ్యతిరేక శక్తులను ఓడించాలని ప్రజలను కోరారు. రాహుల్ గాంధీ తదుపరి భారత ప్రధాని అవుతారని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్తును నిర్దేశించే రాజకీయ పోరాటం "గాంధీ పరివార్", "సంఘ్ పరివార్" మధ్యే జరుగుతోందని ఆయన అభివర్ణించారు. ఆర్ఎస్ఎస్ మతం, కులం, ప్రాంతం, భాషల పేరుతో దేశాన్ని విచ్ఛిన్నం చేస్తోందని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఈ దేశం సంఘ్ పరివార్ వైపు ఉంటుందా లేక గాంధీ పరివార్ వైపు ఉంటుందా అనేది తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# అంగన్వాడీ చిన్నారుల విద్యకు పీసీఆర్ ఫౌండేషన్ చేయూత





**ఖానాపూర్ ఆర్సి మన దునియా ;సెప్టెంబర్ 25:**

జన్నారం: మండలంలోని కిష్టాపూర్ అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీఆర్ (పూర్ణచంద్రరావు) ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్వాడీ చిన్నారుల విద్యాభ్యాసానికి ఉపయోగపడేలా 50 పలకలను అంగన్వాడీ టీచర్ స్వరూపకు అందజేశారు. చిన్నారుల్లో చిన్ననాటి నుంచే విద్యపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, వారికి అవసరమైన విద్యా సామగ్రిని అందించాలనే ఉద్దేశంతో పీసీఆర్ ఫౌండేషన్ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. విద్యార్థుల విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, దాతలు సహకరించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.పీసీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముడుగు ప్రవీణ్ మాట్లాడుతూ.. పేద, గ్రామీణ ప్రాంతాల చిన్నారులకు విద్యా పరంగా అవసరమైన సహాయాన్ని అందించేందుకు ఫౌండేషన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులోనూ విద్య, వైద్యం, పేద కుటుంబాల సంక్షేమానికి తమ వంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో కిష్టాపూర్ సర్పంచ్ వాసాల నరేష్, ఫౌండేషన్ సభ్యులు నోముల రాజ్‌కుమార్, కొత్త శ్రీనివాస్, కానగంటి దేవయ్య, సాయి కిరణ్, ఇప్ప మహేష్, అంగన్వాడీ సూపర్‌వైజర్ పి. వాణి, ఎం పీ పీ ఎస్ ఉపాధ్యాయులు సుధాకర్ నాయక్, అంగన్వాడీ టీచర్లు స్వరూప, వనిత, యశోద తదితరులు పాల్గొన్నారు. చిన్నారుల విద్యాభివృద్ధికి పీసీఆర్ ఫౌండేషన్ అందిస్తున్న సహాయాన్ని పలువురు అభినందించారు.

# వియత్నాం విద్యా విధాన అధ్యయనానికి అంకం కరుణ ఎంపిక

**ఖానాపూర్ ఆర్సి మన దునియా ;సెప్టెంబర్ 25:**

జన్నారం: విదేశాల్లో అమలవుతున్న విద్యా విధానాలను అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన 32 మంది ఉపాధ్యాయుల్లో మంచిర్యాల జిల్లా జన్నారం మండలం అక్కపల్లిగూడ ఎంపీపీ ఎస్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు అంకం కరుణ ఎంపికయ్యారు. వియత్నాంలో అమలవుతున్న విద్యా విధానం, బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యసన విధానాలను అధ్యయనం చేసేందుకు ఆమెకు అవకాశం లభించింది.రాష్ట్ర ప్రభుత్వం గతంలో కూడా విదేశీ విద్యా విధానాలపై అధ్యయనం చేసేందుకు పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను ఫిన్లాండ్ తదితర దేశాలకు పంపించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జన్నారం మండలం కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు దముక కమలాకర్, అక్కపల్లిగూడ ఎంపీపీ ఎస్ పాఠశాల హెచ్‌ఎం జాజాల శ్రీనివాస్లు విదేశీ విద్యా విధానాల అధ్యయనానికి ఎంపికై పర్యటించారు.తాజాగా అదే మండలానికి చెందిన అంకం కరుణ వియత్నాం పర్యటనకు ఎంపిక కావడం పట్ల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటన ద్వారా వియత్నాంలోని విద్యా విధానాలు, ఆధునిక బోధనా పద్ధతులు, విద్యార్థుల అభ్యసనలో అనుసరిస్తున్న నూతన విధానాలను తెలుసుకుని, వాటిలోని ఉపయోగకరమైన అంశాలను మన రాష్ట్ర విద్యా వ్యవస్థలో అమలు చేసేందుకు దోహదపడుతుందని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా శుక్రవారం అంకం కరుణను ఎంఈఓ బి. రాజేందర్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయకుమార్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి, ప్రధాన కార్యదర్శి అనుముల రాజన్న, పాఠశాల హెచ్‌ఎం జాజాల శ్రీనివాస్,



ఉపాధ్యాయులు శెట్టిరాజశేఖర్, అజ్మీర రమేష్, ఎన్. కృష్ణ, కె. మంజుల, జి. శ్రీలత, చైర్మన్ రమాదేవితో పాటు దినసరి ఉద్యోగులు బి. శ్రీకాంత్, నైజ, లలిత, పూజ తదితరులు అభినందించారు.జన్నారం మండలం నుంచి మరో ఉపాధ్యాయురాలు విదేశీ విద్యా విధాన అధ్యయనానికి ఎంపిక కావడం మండల విద్యారంగానికి గర్వకారణమని వారు పేర్కొంటూ, అంకం కరుణకు శుభాకాంక్షలు తెలిపారు.

# సీఈసీ జ్ఞానేశ కుమార్‌పై సుప్రీంకోర్టులో పిటిషన్

**మన దునియా,న్యూఢిల్లీ:సెప్టెంబర్ 25**

కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికలో వెలువడిన పరిశోధనాత్మక కథనం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది.ఈ నేపథ్యంలో, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్న ఎస్ఐఆర్ సంబంధిత నిర్ణయాలన్నింటినీ చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించాలని పిటిషనర్ సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరారు.ముఖ్యంగా నిబంధనలకు విరుద్ధంగా పోర్టల్‌లో మార్పులు చేసిన ఫారమ్-6ను రద్దు చేసి, ఓటర్ల నమోదు నియమాలు-1960 ప్రకారం నిర్దేశించిన అసలైన చట్టబద్ధమైన పాత 'ఫారమ్ 6'ను తక్షణమే పునరుద్ధరించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. అలాగే దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లేదా న్యాయ విచారణ కమిషన్‌తో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. దీంతో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం నిబంధనల ప్రకారం తమ అధికారిక విధులను ఉల్లంఘించినందుకు గాను సీఈసీ జ్ఞానేశ్ కుమార్, డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మనీశ్ గార్గ్ (ఐఏఎస్), ఈసీఐ ఐటీ విభాగాధిపతి సీమా ఖన్నాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టాలని పిటిషనర్ సుప్రీంకోర్టును అభ్యర్థించారు.క్షేత్రస్థాయి ఎన్నికల అధికారుల అధికారాలను కేంద్రీకృతం చేస్తూన సాఫ్ట్‌వేర్ ద్వారా ఓట్ల చేర్పులు, తొలగింపులను ప్రభావితం చేశారని ఆరోపించారు. విచారణ నిమిత్తం ఈసీఐ నెట్‌వర్క్, ఈరోనెట్ సర్వర్ లాగ్‌లు, డేటాబేస్ వివరాలను సురక్షితంగా భద్రపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్ల అంతర్గత అసమ్మతి నోట్లు బహిర్గతమైన వేళ దాఖలైన ఈ పిటిషన్‌తో ఎన్నికల సంఘం వ్యవహారంపై న్యాయపరంగా, రాజకీయంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.



## 24 మద్యం షాపులకు నోటిఫికేషన్

**మన దునియా (ఉమ్మడి గుంటూరు జిల్లా) సెప్టెంబర్ 25**



పల్నాడు జిల్లాలో రెన్యువల్‌కు నోచుకోని ఓపెన్ కేటగిరీలోని 24 మద్యం షాపులకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మణికంఠ తెలిపారు. వచ్చే నెల 1వ తేదీ రాత్రి 12 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో ఎక్సైజ్ స్టేషన్, ఈఎస్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. దరఖాస్తు ఫీజుగా రూ.3 లక్షలు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## నేడు అంగరంగ వైభవంగా ఖైరతాబాద్ గణేశుని నిమజ్జనం!

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 25**



ఖైరతాబాద్ గణపతిని టస్కర్ పైకి చేరి శోభయాత్ర కు బయలుదేరాడు అధికారులు మధ్యాహ్నం రెండు గంటల లోపు గణేశుని నిమజ్జనం పూర్తయ్యేలా ప్రణాళిక చేస్తున్నారు. ఎటువంటి డీజే సౌండ్ వాడకుండా కేవలం సన్నాయి మేళాల మధ్యనే ఖైరతాబాద్ గణేశుడిని గంగమ్మ ఒడికి చేర్చనున్నారు ఇక ఈ భారీ గణేషుడిని ఎన్టీఆర్ మార్గ్ క్రేన్ నెంబర్ 5 వద్ద నిమజ్జనం చేసేం దుకు అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు.ఖైరతాబాద్ గణేశుడంటే తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారు ఉండరు. ప్రతి ఏడాదీ ఇక్కడ గణేశుని నవరాత్రుల వేడుకలు కన్నుల పండువగా సాగుతాయి. గణేశుడు ఈ ఏడాది పంచముఖ సంకట హర మహా గణపతి గా దర్శనమిచ్చాడు. ఈ రోజుతో దర్శనాలు పూర్తి అయ్యాయి. గడిచిన పదిరోజుల పాటు దాదాపు 20 లక్షలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మొదటి రోజు నుంచి నేటి దాకా గణేశుడికి ప్రత్యేక పూజా కార్య క్రమాలు, హారతులు, అభిషేకాలతో పాటు గా ఆయన సన్నిధిలో మహాహోమం, శివ పార్వతుల కళ్యాణం, మహిళలతో ప్రత్యేక హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు ముంబయి బ్యాండ్?తో ఎంతో ఘనంగా వేడుకలు జరిగాయి.

## బాలాపూర్ లడ్డు 39 లక్షలకు సొంతం చేసుకున్న ప్రణీత్ రెడ్డి!

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 25**



హైదరాబాద్ నగరం లోని బాలాపూర్ లో గణేశుడి లడ్డూ వేలం పూర్తయింది, ఈసారి లడ్డు రికార్డు ధర పలికింది. వనస్థలిపు రంలోని సాహెబ్ నగర్ కు చెందిన సామ ప్రణీత్ రెడ్డి, సొంతం చేసుకున్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే బాలాపూర్ లడ్డూకు ఈసారి మరింత డిమాండ్ పెరిగింది. ఏటా నిర్వహించే లడ్డూ వేలంలో ఈసారి కంపెనీలు కూడా పోటీకి దిగడం ఆసక్తికరంగా మారింది. 32 ఏళ్లుగా వ్యక్తిగతంగా కొనసా గుతున్న రిజిస్ట్రేషన్లు, వేలంపాటలో తొలిసారిగా కంపెనీల భాగస్వామ్యం చర్చనీయాంశంగా మారింది. అయితే తాజగా బాలాపూర్ లడ్డును సామ ప్రణిత్ రెడ్డి రూ.39 లక్షలకు దక్కించుకున్నారు.బాలాపూర్ లడ్డూ వేలం కోసం ఈసారి మొత్తం 9 మంది దరఖాస్తుదారులు ముందుకొచ్చారు. వీరిలో ఏకంగా ఐదు కంపెనీలు ఉండటం విశేషం. ఇప్పటివరకు వ్యక్తులు మాత్రమే లడ్డూ వేలంలో పాల్గొంటూ వచ్చారు. అయితే ఈసారి కంపెనీలు కూడా పోటీకి రావడంతో లడ్డూ వేలంపై ఆసక్తి మరింత పెరిగింది.

## గౌడ సంఘం అధ్యక్షుడిగా బాలాగౌడ్.. బీఆర్ఎస్ నాయకుల అభినందనలు

**నూతన అధ్యక్షుడికి బీఆర్ఎస్ నాయకుల ఘన సన్మానం**

**ఖానాపూర్ ఆర్సి మన దునియా, సెప్టెంబర్ 25:**



జన్నారం మండలం కవ్వాల్ గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మెరుగు బాలాగౌడ్‌ను అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీఖాన్, బీఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు ఫజల్ ఖాన్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మెరుగు బాలాగౌడ్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గౌడ సంఘం అధ్యక్షుడిగా బాలాగౌడ్ ఎన్నిక కావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. సంఘ సభ్యుల ఐక్యతను కాపాడుతూ, గౌడ కులస్తుల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు.గ్రామంలో గౌడ సంఘాన్ని మరింత బలోపేతం చేసి, సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో సంఘం ముందుండాలని బీఆర్ఎస్ నాయకులు సూచించారు. నూతన కార్యవర్గం ఆధ్వర్యంలో సంఘం మరింత అభివృద్ధి సాధిస్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మెరుగు బాలాగౌడ్ సన్మానించిన బీఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన గౌడ సంఘ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ, అందరి సహకారంతో సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

## ఎంబీబీఎస్ సీటు సాధించిన గాజుల పద్మావతికి ఆర్ఎంపి పిఎంపీ వైద్యుల ఆధ్వర్యంలో ఘన సన్మానం

**మన దునియా, సెప్టెంబర్ 25,మంచిర్యాల జిల్లా**




మందమర్రి పట్టణ గ్రామీణ ఆర్ ఎం పి అండ్ పీఎంపీ అనుభవ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో, వైద్య మిత్రుడు గాజుల శంకర్ కుమార్తె గాజుల పద్మావతి ఉత్తమ ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ సీటు పొందిన సందర్భంగా శుక్రవారం ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం తరపున అభినందన పత్రాన్ని అందజేసి, ఆమెను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. గ్రామీణ వైద్యులు, ఆర్ ఎంపీ లు, పీఎంపీ ల కుటుంబాల నుంచి కూడా ఎంతోమంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో వైద్య వృత్తిలోకి రావాలని ఆకాంక్షించారు. కష్టపడి చదివి ఎంబీబీఎస్ సీటు సాధించిన గాజుల పద్మావతి విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని, ఆమె భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదిగి సమాజానికి సేవ చేయాలని సంఘం నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గోనే గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి అడ్డూరి సాంబమూర్తి, గౌరవ అధ్యక్షులు కట్ల శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంద తిరుమల రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాదాసు శంకరయ్య, గోనే శ్రీనివాస్, గోనే సత్యం, వేముల నరసయ్య, అయిల్లా లక్ష్మణ్, తిప్పని శ్రీనివాస్, నర్సింగ్ రోజు తిరుపతి, రాయమల్లు, మల్లేష్ తదితర వైద్య మిత్రులు పాల్గొన్నారు. అనంతరం గాజుల పద్మావతి కి మందమర్రి పట్టణ గ్రామీణ అరేంపి అండ్ పీఎంపీ అనుభవ వైద్యుల సంఘం తరపున హృదయపూర్వక అభినందనలు శుభాకాంక్షలు.

## ప్రెస్ క్లబ్‌లో టీవీ, వాటర్ డిస్పెన్సర్ ప్రారంభం

**సభ్యుల సౌకర్యాల కోసం ఆధునిక వసతుల ఏర్పాటు**

**పాత్రికేయుల అవసరాలకు అనుగుణంగా కార్యాలయ అభివృద్ధి**

**మన దునియా,సెప్టెంబర్ 25,మంచిర్యాల జిల్లా**





స్థానిక మందమర్రి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో నూతన ఎల్ఈడీ టీవీ, వాటర్ డిస్పెన్సర్‌ను ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గజ్జల చందర్, కమిటీ సభ్యులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చందర్ మాట్లాడుతూ పాత్రికేయులు విధుల నిర్వహణలో భాగంగా తాజా వార్తలను ఎప్పటికప్పుడు వీక్షించేందుకు టీవీ ఉపయోగపడుతుందని, సభ్యులకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు వాటర్ డిస్పెన్సర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రెస్ క్లబ్ కార్యాలయంలో సభ్యులకు అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు మరిన్ని వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. పాత్రికేయుల సంక్షేమం, కార్యాలయ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సభ్యుల సహకారంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చందర్, ప్రధాన కార్యదర్శి సలాముద్దీన్, కోశాధికారి శాకినాల శంకర్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.

## సింగరేణి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వృత్తి విద్యా శిక్షణ కోర్సులు వినియోగించుకోవాలి

**మన దునియా, సెప్టెంబర్ 25,మంచిర్యాల జిల్లా**

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వృత్తి విద్యా శిక్షణ కోర్సుల దరఖాస్తులు స్వీకరించడానికి తేదీ.25.09.2026 నుండి 01.10.2026 వరకు పొడిగిస్తున్నామని డి.జి.ఎం (పర్సనల్) సీహెచ్. అశోక్ తెలియజేశారు.సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా 'సింగరేణి సేవా సమితి' ఆధ్వర్యంలో మహిళలు, యువత స్వయం ఉపాధి పొందేందుకు వీలుగా పలు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డి.జి.ఎం (పర్సనల్) సీహెచ్. అశోక్ ప్రకటనలో తెలిపారు.

3 నెలల శిక్షణ: టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్.

2 నెలల శిక్షణ: కంప్యూటర్ డి.టి.పి (డీటీపీ).అర్హులు: గనుల ద్వారా భూములు కోల్పోయిన భూ నిర్వాసితుల భార్య వారి పిల్లలు?మందమర్రి ఏరియా సింగరేణి కార్మికులు మాజీ కార్మికుల భార్య వారి పిల్లలు.?కేకే ఓసీపీ (కేకే ఓసీపీ), ఆర్కే ఓసీపీ (ఆర్కే ఓసీపీ) ప్రాజెక్టుల పరిసర ప్రాంతాలు బెల్లంపల్లి, కాసిపేట, సోమగూడెం, మందమర్రి, రామకృష్ణాపూర్ చుట్టుపక్కల గ్రామాల మహిళలు, ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను మందమర్రిలోని జీఎం ఆఫీస్ నందు గల "జీఎం పీఏ ఆఫీస్" (జీఎం పి ఏ ఆఫీస్) లో అందజేయాల్సి ఉంటుంది. ?దరఖాస్తుల ?మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్: 7032878575,దరఖాస్తుకు జత చేయవలసినవి.ఎస్ ఎస్ సి మెమో ఆధార్ కార్డ్,పాస్ ఫోటో,సింగరేణి ఉద్యోగి లేదా మాజీ కార్మికులైనచో ఐడెంటిటీ కార్డు జత చేయవలెనని పేర్కొన్నారు.

# దేశం కోసం జీవించిన మహనీయుడు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ





**వారి ఆశయాలను ఆచరణలోకి తీసుకురావడమే ఆయనకు నిజమైన నివాళి**

**బీజేపీ రాష్ట్ర నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి**

**మన దునియా,షాద్‌నగర్:సెప్టెంబర్ 25**

పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ షాద్‌నగర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారు దేశం, సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప జాతీయవాది అని కొనియాడారు. సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతే నిజమైన దేశాభివృద్ధి అనే "అంత్యోదయ" సిద్ధాంతాన్ని ఆయన దేశానికి అందించారని తెలిపారు. భారతీయ సంస్కృతి, జాతీయత, సామాజిక సమానత్వం, పేదల సంక్షేమం కోసం ఆయన చేసిన ఆలోచనలు, త్యాగాలు నేటి తరానికి కూడా మార్గదర్శకమని అన్నారు. ఏకాత్మ మానవతావాదం ద్వారా భారతీయ జీవన విధానానికి అనుగుణమైన రాజకీయ, సామాజిక ఆలోచనా విధానాన్ని దేశానికి అందించిన మహనీయుడు దీన్ దయాళ్ ఉపాధ్యాయ జీ అని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ చివరి వ్యక్తి వరకు సంక్షేమం, సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు, దేశ ప్రగతిని లక్ష్యంగా చేసుకుని పనిచేయడమే బీజేపీ కార్యకర్తల కర్తవ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి ఇస్నాతి శ్రీనివాస్, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు విస్లావత్ మోహన్ సింగ్ నాయక్, సీనియర్ నాయకులు వంశీకృష్ణ, సుధాకర్ అప్ప, కొందుర్గు, కొత్తూరు మండలాల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, అత్తాపురం మహేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్, నాయకులు మల్చలశీ మురళి, రిషికేష్, కృష్ణ యాదవ్, హాజిపల్లి ఉపసర్పంచ్ గంగాధర్, గుడాల రమేష్, మహిళా మోర్చా నాయకురాలు రాజేశ్వరి, లావణ్య, దినేష్ రెడ్డి, గజ్జల ప్రవీణ్, రాజేందర్, వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు..

# జర్నలిస్టు బస్వరాజ్‌పై కేసులు ఎత్తివేయాలి

**ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం నేరం కాదు: తెడ్డు పోశెట్టి**

**నిజామాబాద్,జిల్లా మన దునియా ప్రతినిధి:సెప్టెంబర్ 25 :**



నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని మోపాల్ మండలం తాడెం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో అవకతవకలపై వార్తా కథనాలు ప్రచురించిన సీనియర్ జర్నలిస్టు బస్వరాజ్‌పై కేసులు నమోదు చేయడం సరికాదని జన వికాస సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు తెడ్డు పోశెట్టి అన్నారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావాల్సిన జర్నలిస్టులపై కేసులు నమోదు చేయడం వల్ల పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగే అవకాశం ఉందన్నారు. బస్వరాజ్‌పై నమోదైన కేసులను వెంటనే పునఃపరిశీలించి ఎత్తివేయాలని ఆయన డిమాండ్ చేశారు.నిజామాబాద్ రూరల్ ప్రాంతంలో పలువురు బాధితులు తమ సమస్యలను మీడియా దృష్టికి తీసుకువస్తున్నారని, వారి సమస్యలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. గుండారం పరిధిలో అటవీ భూములకు సంబంధించిన అంశాలపై కూడా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని ఆయన అన్నారు.జర్నలిస్టులపై ఒత్తిళ్లు తీసుకురావడం కాకుండా వారు లేవనెత్తిన ప్రజా సమస్యలపై అధికారులు స్పందించాలని పోశెట్టి సూచించారు. ప్రజా సమస్యలను ప్రశ్నించే జర్నలిస్టులకు అండగా ఉంటామని ఆయన తెలిపారు. జర్నలిస్టులకు అండగా ఉంటుందన్న కాంగ్రెస్ ప్రభుత్వం. స్టేజ్ పైన విలేకరులు లేకుంటే ఫోర్త్ స్టేట్ లేదు అని పెద్దలు అంటుంటారు. కానీ జర్నలిస్టులను కేసులు వేసే ప్రభుత్వాన్ని నిజామాబాద్ జిల్లాలో చూస్తున్నాం. కొన్ని మంచి పనులు చేస్తున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే పిఏ అక్రమాలు బాధితులు రోజురోజుకు మీడియాని ఆశ్రయించడంతో నిజామాబాద్ జిల్లాలో చర్చని అంశంగా మారింది.

# చతిస్గడ్ లోభారీ వర్షాల కారణంగా గోదావరి ఉగ్రరూపం





**మన దునియా, వాజేడు, సెప్టెంబర్ 25**

గోదావరి నది ప్రవాహకమైన ఇంద్రావతి నది చత్తీస్గడ్ సరిహద్దుల్లో పడ్డ భారీ వర్షాల నేపథ్యంలో సమ్మక్క సాగర్ బ్యారేజ్ వద్ద గోదావరి వరద నీటి ప్రవాహం 25/09/2026న ఉదయం 6.00 నిమిషాలకు 9,5400 సి యస్ నుండి ఈరోజు సాయంత్రం 6:00కు 1,79500 సి యస్ కు పెరగడం జరిగింది తదుపరి నీటి ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నందున గోదావరి నదిలో చేపలు పట్టేవారు గానీ పరివాహక ప్రాంతంలోని మనుషులు నదిలోకి వెళ్లడం గాని పశువులను దాటించడం గాని చేయవద్దని గోదావరి నది పరివాహక ప్రాంత ప్రజలకు తెలియజేయవలసినదిగా సంబంధిత అధికారులకు మండల అధికారులకు తెలియజేయడమైనది జిల్లా నీటిపారుదల అధికారి ములుగు వారు తెలియపరుస్తున్నారు

మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం



# పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం..





**ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా పల్లెలను తీర్చిదిద్దాలి.**

**ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత.**

**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క.**

**మన దునియా,ములుగు జిల్లా,మల్లంపల్లి:సెప్టెంబర్ 25**

పల్లెలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. శుక్రవారం మల్లంపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో మంత్రి అనసూయ సీతక్క, రూరల్ డెవలమెంట్ ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి ఐ ఫ్ ఎస్ తో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలన, మొక్కల పెంపకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. 'స్వచ్ఛత హి సేవ' పక్షోత్సవాల్లో భాగంగా చేపట్టిన 'ఏక్ పేడ్ మా కే నామ్' కార్యక్రమంలో మంత్రి సీతక్క మొక్కను నాటారు. పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత అంశాలపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. నిత్యం గ్రామాల పరిశుభ్రత కోసం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులను మంత్రి ఘనంగా సన్మానించారు. కార్మికులకు సబ్బులు, కొబ్బరి నూనె, మాస్కులు, గ్లౌజులతో కూడిన పీపీఈ కిట్లను పంపిణీ చేశారు. పారిశుధ్య కార్మికుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో సాధారణ ఆరోగ్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ అడవులు, పచ్చదనం కారణంగానే ములుగు జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. ప్రకృతే మానవాళికి, జీవరాశులకు జీవనాధారమని పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్లాస్టిక్‌ను పూర్తిగా దూరం చేయాలని పిలుపునిచ్చారు.

పరిశుభ్రతను పాటిద్దాం.. పచ్చదనాన్ని పెంచుదాం..

ఆరోగ్యాన్ని కాపాడుకుందామని మంత్రి పేర్కొన్నారు. 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా విజయవంతం చేయాలని కోరారు. మహిళా సంఘాల సభ్యులతో పాటు ప్రజలంతా శ్రమదాన కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని మంత్రి సూచించారు. శారీరక శ్రమతోనే ఆరోగ్యంగా, దృఢంగా ఉండగలమని తెలిపారు. ఎండ, వాన, చలిని తట్టుకుంటూ కష్టపడే తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని, ప్రకృతితో మమేకమై జీవించాలని సూచించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. మంచి విద్యార్థులుగా ఎదిగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, జిల్లాకు పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మిషన్ డైరెక్టర్ సురేష్ బాబు,అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డి పి ఓ వెంకయ్య, డి ఆర్ డి ఓ రవీందర్, యం పి ఓ రహీం, ఏ పి డి, స్వచ్ఛ భారత్ మిషన్ డిస్టిక్ కో ఆర్డినేటర్, స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




## విదేశీ పర్యటనకు ఎంపికైన మంథని ఉపాధ్యాయుడు

**మన దునియా,పెద్దపల్లి జిల్లా:సెప్టెంబర్ 25**



ఎక్స్ ఫ్లోరర్ విజిట్ లో భాగంగా ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా 29 మంది ఉపాధ్యాయు లను సింగపూర్, వియాత్నాం, జపాన్, వంటి దేశాల్లో బోధన పద్ధతులపై అధ్యా యనానికి ఎంపిక చేయగా... వారిలో పెద్దపల్లి జిల్లా మంథని పట్టణ కేంద్రంలోని జెడ్పి హెచ్ ఎస్ బాలికల పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయు డు భరత్ రెడ్డి, వియ త్నాం, దేశ పర్యటన కు ఎంపికయ్యారు. ఈ పర్యటన వచ్చే నెల 10 నుంచి 17వ తేదీ వరకు సాగనుం ది,రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను ఎంపిక చేసి అంతర్జాతీయ విద్యా విధానాలను అధ్య యనం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ అధి కారులు తెలిపారు. భరత్ రెడ్డి,గణిత బోధనలో చూపిస్తున్న ప్రతిభ, విద్యార్థుల పట్ల అంకితభావంతో పనిచేస్తుండటంతో ఆయన ఈ అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నారు. వియత్నాంలోని విద్యా సంస్థలను సందర్శించి అక్కడి బోధనా పద్ధతులను తెలుసుకుని రాష్ట్రం లో అమలు చేసేందు కు ఈ పర్యటన దోహదపడుతుంది, ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లి దండ్రులు, మంథని స్థానికులు, స్నేహితు లు భరత్ రెడ్డి కి అభినందనలు తెలిపారు.

## గుమ్మడిదొడ్డి ఎంపి యుపి ఎస్ పాఠశాలలో ఏకరూప దుస్తులు పంపిణీ



**మన దునియా, వాజేడు, సెప్టెంబర్ 25**

ములుగు జిల్లా వాజేడు మండలం గుమ్మడిదొడ్డి ఎంపియుపిఎస్ పాఠశాల లో ప్రభుత్వం అందించిన ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి గ్రామపంచాయతీ సర్పంచ్ బోధే బోయిన భరత్ కుమార్ మరియు కమిటీ చైర్మన్ పాఠశాల హెచ్ఎం చేతుల మీదుగా ఏకరూప దుస్తులను మరియు బూట్లు సాక్షులు అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఉచితంగా యూనిఫామ్ ఇలాంటివి అందించటం చాలా సంతోషకరమైన విషయం అన్నారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించడం అనేది విద్యార్థుల్లో పేద ధనిక అనే భేదాలు లేకుండా సమానత్వ భావనను సూచిస్తుందని కొత్త యూనిఫామ్ సాక్షులు బెల్టు ఇవ్వడం వల్ల విద్యార్థుల్లో నూతన ఉత్సాహం కలుగుతుందని పాఠశాలకు వెళ్లాలని ఆసక్తి పెంచుతుందని పాఠశాల ఆవరణంలో ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని క్రమశిక్షణ అభ్యసించి ఉత్తమ విద్యా పలితాలను సాధించాలని అన్నారు మా ఆహ్వానం మేరకు పాఠశాల అభివృద్ధి కార్యక్రమాల్లో బాగాస్వామి అవుతున్న గ్రామ సర్పంచ్ మరియు పాలకవర్గం ధన్యవాదాలు తెలియజేస్తున్నాను ఈ కార్యక్రమంలో తోటి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టులపై అక్రమ కేసులు వెంటనే ఎత్తు వేయాలి





**సిపిఐ రూరల్ ఇంచార్జ్ మోహన్ డిమాండ్.**

**నిజామాబాద్ జిల్లా మన దునియా**

జర్నలిస్టు బసవరాజ్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలి. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే పిఏ వెంటనే క్షమాపణ చెప్పాలి.? బసవరాజ్ పై థర్డ్ డిగ్రీ చేసిన అధికారులకు వెంటనే సస్పెండ్ చేయాలి డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం కేంద్రంలో సిపిఐ నియోజవర్గ ఇన్చార్జ్ గడ్డం మోహన్ మాట్లాడుతూ మన దునియా స్టాఫ్ రిపోర్టర్:సీనియర్ జర్నలిస్టు బసవరాజ్ పై అక్రమ కేసు వెంటనే వ్యక్తి వేయాలి. నిజాలు నిర్భయంగా రాసే వ్యక్తిపై అక్రమ కేసులు పెట్టడం దారుణం అని ఆయన అన్నారు. ప్రజా సమస్యల కోసం నిత్యం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకె అతను చేసిన తప్ప అక్రమ కేసులు పెట్టి థర్డ్ డిగ్రీ ఉపయోగించడం చిత్రహింసలు పెట్టడం మనకు కల్పించిన హక్కు. మానవ హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తగిన బుద్ధి చెప్తారు ప్రజలు అన్ని గమనిస్తున్నారని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి పిఏ బహిరంగంగా మీడియా మిత్రులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పి ఎ బాధితులు రోజురోజు బయటకు రావడంతో ఎమ్మెల్యే నోరు విప్పాలి ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఎమ్మెల్యేకు ఉంది. బసవరాజ్ కుటుంబానికి ఎమ్మెల్యే భరోసా కల్పించాలి. జీవన ఆధారాన్ని కోల్పోయేలా అతని ఆరోగ్యం



రోజురోజుకి క్షీణిస్తుంది. అతను అతను నిరుపేద కుటుంబానికి చెందిన వాడు సొంతగా వాహనంతో ప్రజల కోసం నిత్యం పరితపించే వ్యక్తిని చిత్రహింసలు పెట్టి అక్రమ కేసులతో ఆయనను భయపెట్టడం ఇదంతా చూస్తూ రాజకీయ విశ్లేషకులు నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మోహన్ సిపిఎంఎల్ పార్టీ రూరల్ ఇన్చార్జి గడ్డం గంగా మోహన్ భాస్కర్ అనిల్ రమేష్ శ్రీనివాస్ వాజిత్ రమేష్, తదితరులు పాల్గొన్నారు

# పిల్లల్లో జింక్ లోపం నష్టాలు...

ప్రతి తల్లిదండ్రులకి వారి పిల్లలే ఒక ప్రపంచంగా భావిస్తూ, వారు పడిన కష్టం వారి పిల్లలు పడకూడదు అంటు,వారికి ఏమి ఇష్టమైతే ఆట వస్తువులు కొనివ్వడం,ఇష్టమైన ఆహారాలను అతిగా ఇవ్వడం, సరైన క్రమశిక్షణలో పెట్టకపోవడం వంటి వాటి వల్ల సమాజా నికి ఎంత హాని కలుగుతుందో అంతే మోతాదులో వారి ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని గ్రహించలేకపోతున్నారు. పిల్లలకు పోషకాహార లోపాలలో తలెత్తడం వాళ్ళ వారి ఆరోగ్యం రోజురోజుకి క్షీణిస్తోందని వైద్య నిపుణులు కూడా హెచ్చరిస్తూ ఉన్నారు. మరి ముఖ్యంగా 10 మందిలో 6 మంది పిల్లలు జింక్ లోపాలతో బాధపడుతున్నారని,దాని వల్ల చాలా అనారోగ్యాలు కలుగుతాయని హెచ్చరిస్తున్నారు కూడా. రోగనిరోధక వ్యవస్థ దెబ్బ తినడం. : పిల్లలు తినే ఆహారాల్లో జింకు లోపం వల్ల,రోగాలకు కారణమైన బ్యాక్టీరియా మరియు ఫంగస్ తో సైనికుడిలా పోరాడే రోగనిరోధక వ్యవస్థ దెబ్బతింటుందని చాలా పరిశోదనాల్లో కూడా తేలింది. కావున ఇమ్యూన్ సిస్టమ్ సరిగా పని చేసేందుకు జింక్ అధికంగా ఉన్న గుమ్మడి కాయ,గుమ్మడి గింజలు,బాదాం,పాలు, అరటిపండు వంటి ఆహారాలను అధికంగా ఇవ్వడం అలవాటు చేయండి. బ్లడ్ క్లాటింగ్ అవకపోవడం..: పిల్లలు తరుచూ దెబ్బలు తగిలించుకుంటూనే ఉంటారు. కొంతమందికి బ్లడ్ కొంతసేపు వచ్చి,గాయం దగ్గర బ్లడ్ క్లాట్ అవుతుంది. కానీ జింక్ లోపం కలవారికి బ్లడ్ గడ్డ కట్టకుండా,దారాలంగా రక్తం వస్తూనే ఉంటుంది. రక్తహీనత ఏర్పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కావున పిల్లలకు బ్లడ్ క్లాటింగ్ సక్రమంగా జరగాలంటే జింకు ఉన్న ఆహారాలు ఎక్కువగా ఇవ్వడం చాలా అవసరం.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## సెర్వైకల్ నొప్పితో బాధపడుతున్నారా?



ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. మెడలో బిగుసుకుపోవడం, భుజాలలో ఒత్తిడి, తలనొప్పి, వీపు నొప్పి వంటివి సెర్వైకల్ లక్షణాలుగా ఉండవచ్చు. సెర్వైకల్ నొప్పిని తగ్గించడానికి మీరు కొన్ని వ్యాయామాల సహాయం తీసుకోవచ్చు. ఈ వ్యాయామం మెడ బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కండరాలను సడలిస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి నిటారుగా కూర్చోండి లేదా నిలబడండి. ఆ తర్వాత మెడను నెమ్మదిగా ముందుకు వంచండి. ఆపై వెనుకకు వంచండి. ఈ ప్రక్రియను 5 నుండి 10 సార్లు చేయండి. దీని వల్ల సెర్వైకల్ నొప్పి తగ్గవచ్చు. ఇది మెడ సౌలభ్యాన్ని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి తలను నెమ్మదిగా కుడి వైపుకు తిప్పండి. కొన్ని సెకన్ల పాటు ఆపండి. ఆ తర్వాత తలను ఎడమ వైపుకు తిప్పండి. రెండు దిశలలో ఒక్కొక్కటి 5 సార్లు చేయండి. ఇది మెడ పక్కని కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. తలను నెమ్మదిగా కుడి వైపుకు వంచండి (చెవిని భుజం వైపు తీసుకురండి). 10 సెకన్ల పాటు ఆపండి. ఆపై ఎడమ వైపుకు పునరావృతం చేయండి. ఈ ప్రక్రియను 3-4 సార్లు చేయండి. ఈ భంగిమ మీ మెడ స్థానాన్ని మెరుగుపరుస్తుంది. సెర్వైకల్ నొప్పిని తగ్గిస్తుంది. దీన్ని చేయడానికి మీ వీపు, మెడను నిటారుగా ఉంచండి. ఆపై గడ్డాన్ని మెడ వైపు నెమ్మదిగా లోపలికి లాగండి. 5 సెకన్ల పాటు ఆపి, ఆ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వెళ్లండి. దీన్ని 10 సార్లు పునరావృతం చేయండి.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?

రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎమ్జ్ పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్‌గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.



# పేపర్ ప్లేట్లతో క్యాన్సర్ ముప్పు..లివర్, బ్రెస్ట్, ఇతర క్యాన్సర్ల బారిన పడుతున్న జనం

**హైదరాబాద్ వినాయక మండపాల్లో ఇప్పటికే కోట్ల సంఖ్యలో పేపర్ ప్లేట్ల వాడకం**

**ఫంక్షన్ హాల్స్, పెళ్లిళ్లలో విచ్చలవిడిగా వినియోగం**

**ప్రత్యామ్నాయంగా స్టీల్ వాడితేనే ఆరోగ్య భవిష్యత్తు**

**స్టీల్ బ్యాంకు'తో ఆదర్శంగా నిజామాబాద్ జిల్లా చౌట్‌పల్లి**

**అన్ని చోట్లా స్టీల్ వాడకంపై దృష్టి పెట్టాలంటున్న నిపుణులు**

**మన దునియా,హైదరాబాద్:సెప్టెంబర్ 25**

హైదరాబాద్ సిటీ : పేపర్ప్లేట్లలో వేడి వేడి ఫుడ్ తింటున్నారా.. అయితే, మీరు క్యాన్సర్‌ను కొని తెచ్చుకున్నట్లే. ప్లాస్టిక్, రంగుల పూతతో ఉన్న పేపర్ ప్లేట్లు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వేడి వేడి అన్నం, కూరలు వీటిలో వడ్డించినప్పుడు ప్లేట్లలోని రసాయనాలు కరిగి నేరుగా మన కడుపులోకి చేరుతున్నాయి. దీర్ఘకాలంలో ఇవి ప్రాణాంతక క్యాన్సర్లకు దారితీస్తున్నాయని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. కాగితం నానిపోకుండా, నూనె కారకుండా తయారీదారులు వాటికి పాలిథిన్ కోటింగ్ లేదా కృత్రిమ రంగులను వాడుతున్నారు. ఈ ప్లేట్లలో ఎక్కువ వేడి ఉన్న ఆహార పదార్థాలు వడ్డించినప్పుడు, ఆ కెమికల్స్ కరిగి ఆహారంలో కలిసిపోతున్నాయి. ఇవి క్రమంగా జీర్ణవ్యవస్థలోకి వెళ్లి లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్లకు, మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్‌కు దారితీస్తున్నాయని రీసెర్చ్‌లు చెబుతున్నాయి. దీనికి తోడు శరీరంలో రోగ నిరోధక శక్తి కూడా తగ్గిపోతోంది. ఐసీఎంఆర్, నేషనల్ క్యాన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ అంచనాల ప్రకారం..2025లో తెలంగాణలో దాదాపు 50 వేల పైనే క్యాన్సర్ కేసులు నమోదయ్యాయి. ఇందులో 29 వేల మందికి పైగా వివిధ రకాల క్యాన్సర్‌లతో చనిపోయారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**ఏమిటీ ఈ కెమికల్..?**

కలర్ పేపర్ ప్లేట్లను ఎక్కువగా వినియోగిస్తే అందులో ఉండే బిస్ఫినాల్ అనే కెమికల్ మనిషి శరీరంలోకి చేరుతుంది. ఇది దీర్ఘకాలిక వ్యాధులైన కాలేయ క్యాన్సర్, కిడ్నీల రోగాలతో పాటు నర్వ్ సిస్టమ్‌ను దెబ్బతీస్తుంది. కాగితపు ప్లేట్లను బయో ప్లాస్టిక్, పెట్రోలియం ప్లాస్టిక్ పూతతో తయారు చేయడం వల్ల వేడి ఆహారం తినే సమయాల్లో ఈ కోటింగ్ రసాయనంగా మారి శరీరాల్లోకి చేరి అనారోగ్య సమస్యలకు కారణమవుతోంది. రంగు రంగుల కాగితపు ప్లేట్లు, డిస్పోజబుల్ కప్పులు, ప్లాస్టిక్ కోటింగ్ ఉన్న వస్తువుల తయారీలో విస్తృతంగా ఉండే ఒక ప్రమాదకరమైన రసాయనమే బిస్ఫినాల్- ఏ. అలాగే, ఆకర్షణీయమైన రంగుల కోసం రసాయన ఇండస్ట్రియల్ డైస్‌ను వాడతారు. ఇలా రంగులు, ప్లాస్టిక్ కోటింగ్, పాలిథిన్‌లు ఉండే పేపర్ ప్లేట్లలో వేడి వేడి ఫుడ్ వేసుకుని తినడం వల్ల ప్రమాదకరమైన కెమికల్స్ నేరుగా పొట్టలోకి చేరుతున్నాయి.

**లక్షకుపైగా మండపాలు.. కోట్ల ప్లాస్టిక్ ప్లేట్లు..**

ప్రస్తుతం వినాయక నవరాత్రుల సందర్భంగా అంతటా అన్నదానాలు నిర్వహించారు. ఎక్కడ చూసినా రంగురంగుల కలర్ ప్లేట్లలోనే తిన్నారు. అప్పటికప్పుడు వీటిని కొనుగోలు చేసే సౌకర్యం, ఒకేసారి వినియోగించి పడేసే వీలు ఉండటంతో కలర్ పేపర్ ప్లేట్లనే ఉపయోగిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో దాదాపు 1.40 లక్షలకు పైగా వినాయక మండపాలను ఏర్పాటు చేశారు. చిన్న విగ్రహాల వద్ద కూడా అన్నదానాలు చేశారు. దాదాపు పది రోజులుగా ప్రతీ ఏరియాలో రోజూ ఏదో ఓ మండపం వద్ద అన్నదానం చేశారు. ఇందులో చాలా చోట్ల ప్లాస్టిక్ కవర్‌తో కూడిన పేపర్ల ప్లేట్లలో భోజనాలు పెట్టారు. ప్రతి మండపం వద్ద కనీసం ఒక్క రోజు అన్నదానం జరిగినా, సుమారు 200 మంది చొప్పున తిన్నా.. కోట్లలో పేపర్ ప్లేట్ల వినియోగం జరిగింది. కేవలం పది రోజుల్లో కోట్లాది కాగితపు ప్లేట్లు చెత్తాచెదారంగా మారి నగర పర్యావరణాన్ని సైతం కలుషితం చేశాయి.




**స్టీల్ బ్యాంకు'లపై ఫోకస్ పెట్టాలి..**

హానికరమైన కెమికల్స్ ప్రమాదం నుంచి బయటపడటానికి పేపర్, ప్లాస్టిక్ ప్లేట్ల స్థానంలో రీయూజ్ చేసే స్టీల్ వస్తువులను ప్రోత్సహించాల్సిన టైం వచ్చిందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ప్రజల్లో దీనిపై పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని, ప్రభుత్వాలు, ఉత్సవ కమిటీలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్లాస్టిక్ కలర్ పేపర్ ప్లేట్ల నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని సూచిస్తున్నారు. వీటి స్థానంలో అరిటాకులు, మోదుగు ఆకుల విస్తరాకులు వాడటం ఉత్తమమని.. లేదా పండగలు, సామూహిక భోజనాల సమయంలో 'స్టీల్ బాంక్'ను అమలు చేయడం సమర్థమైన ప్రత్యామ్నాయంగా మారాలని చెప్తున్నారు. ఇటీవల కొన్ని గ్రామాలు, యువజన సంఘాలు స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసుకుంటున్నాయి. తెలంగాణలోని కొన్ని గ్రామాలు, గ్రామ పంచాయతీ, యువసేనల ఆధ్వర్యంలో 'స్టీల్ ప్లేట్లు, గ్లాసుల బ్యాంకు'లను ఏర్పాటు చేశాయి. ఏ ఇంటిలో శుభకార్యం జరిగినా, లేదా ఏ సామూహిక అన్నదానం జరిగినా ఉచితంగా స్టీల్ ప్లేట్లను అందిస్తున్నారు. వాటిని తీసుకువెళ్లి, భోజనాలు ముగిశాక శుభ్రం చేసి తిరిగి ఇస్తున్నారు. ఈ విధానం ద్వారా కొన్ని గ్రామాలు ప్లాస్టిక్ పేపర్ వ్యర్థాలను పూర్తిగా నిరోధించగలిగాయి. ఈ కేస్ స్టడీలను స్ఫూర్తిగా తీసుకుని హైదరాబాద్‌లోని కాలనీలు, బస్తీ సంఘాలు స్వచ్ఛందంగా స్టీల్ ప్లేట్ల వాడకాన్ని ఉద్యమంలా చేపట్టాలని నిపుణులు పేర్కొంటున్నారు.

**ఆదర్శం చౌట్‌పల్లి..**

ప్లాస్టిక్ కవర్లు, పేపర్ ప్లేట్లతో తినడం వల్ల క్యాన్సర్లు వస్తున్నాయన్న డాక్టర్ల సూచనలతో నిజామాబాద్ జిల్లాలోని కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో మే1, 2026 నుంచి ప్లాస్టిక్ ప్లేట్లలో తినడం నిషేధించారు. గ్రామంలో ఎక్కడ ఫంక్షన్ జరిగినా.. పెళ్లిళ్లు, బర్త్ డే పార్టీలు, శారీ ఫంక్షన్లు అన్నింటికీ ఉచితంగా స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులను అందిస్తున్నారు. గ్రామంలోని గవర్నమెంట్ ఎంప్లాయీస్ యూనియన్, శ్రీలక్ష్మీనారాయణ స్వామి ట్రస్ట్ మొత్తం 1,000 ప్లేట్లు, గ్లాసులు స్పాన్సర్ చేశారు. దీనికి ఒక ప్రత్యేక ప్రతినిధిని నియమించి 'స్టీల్ బ్యాంకు' ఏర్పాటు చేశారు. ఊళ్లో ఉత్సవాలు జరిగినా, పెళ్లిళ్లు, బర్త్ డే పార్టీలు, అన్నింటికీ ఈ ప్లేట్లను యూజ్ చేస్తున్నారు. ఫంక్షన్ చేసుకునే వారు ముందుగా ఈ స్టీల్ బ్యాంకుకు చెందిన వ్యక్తికి ఫోన్ చేస్తే స్టీల్ ప్లేట్లు, గ్లాసులు అరేంజ్ చేస్తున్నారు. ఊళ్లో మార్కెట్‌తో పాటు, కిరాణాషాపులు, టీ హోటల్స్‌లో ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ టీ కప్పులను నిషేధించి ఈ గ్రామ పంచాయతీ ఆదర్శంగా నిలుస్తోంది.

మనుషులకు, పశువులకూ ముప్పే

బిప్లాస్టిక్ ప్లేట్లలో వేడి వేడిగా ఉన్న ఆహారం వేసుకుని తింటే రోగాలను కొని తెచ్చుకోవడమే అవుతుంది. కలర్ పేపర్ ప్లేట్లలో అన్నం తింటే మైక్రోప్లాస్టిక్స్ కడుపులోకి వెళ్లి క్యాన్సర్‌కు దారి తీస్తాయి. తిన్న ప్లేట్లను బయటపడేస్తే పశువులు తినడం వల్ల వాటికీ ముప్పు కలుగుతుంది. అందుకే వీలైనంత మేరకు ప్లాస్టిక్, పేపర్ ప్లేట్లకు దూరంగా ఉండాలి.

# ప్రజా సమస్య రాస్తే కేసులా?

**జర్నలిస్ట్ బస్వరాజ్‌పై థర్డ్ డిగ్రీ ఉపయోగించిన వారిపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి**

**తాడెం ఉపాధి హామీ పనుల వ్యవహారంపై సమగ్ర విచారణకు డిమాండ్**

**హైదరాబాద్:, సెప్టెంబర్ 25**

రెండు తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్ట్ పై థర్డ్ డిగ్రీ ఉపయోగించడం పై జర్నలిస్ట్ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్‌మెంట్ తెలంగాణ రాష్ట్ర యువజన అధ్యక్షుడు జనరల్ కార్యదర్శి) యాదవ్ శివకుమార్ మాట్లాడుతూ హైదరాబాద్ మీడియా సమావేశంలో ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే జర్నలిస్టు చేసిన తప్పా? సమస్యలపై ప్రశ్నించిన జర్నలిస్టుపై కేసు నమోదు కావడం ఎందుకనే ప్రశ్నలు ఇప్పుడు తాడెం గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. మోపాల్ మండలం తాడెం గ్రామపంచాయతీ పరిధిలోని సిర్పూర్ చెరువు కట్ట వద్ద ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు తమకు తాగునీరు, నీడ, వైద్య సదుపాయాలు వంటి కనీస సౌకర్యాలు అందడం లేదని జర్నలిస్టులకు చెప్పినట్లు సమాచారం. ఈ విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకెళ్లిన జర్నలిస్టులు సమస్య పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ఈ క్రమంలో తనను ఫోన్‌లో దూషించి బెదిరించారని జర్నలిస్ట్ బస్వరాజ్ ఆరోపించారు. ఘటనపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ నెలలు గడిచినా సంబంధిత వ్యక్తులపై చర్యలు కనిపించలేదని ఆయన వర్గం ఆరోపిస్తోంది. అయితే ఇదే వ్యవహారంలో జర్నలిస్ట్ బస్వరాజ్‌పై కేసు నమోదు కావడం తీవ్ర చర్చకు దారితీసింది. పోలీసుల కస్టడీలో తనపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆయన ఆరోపిస్తున్నారు. జర్నలిస్టుపై వచ్చిన ఆరోపణలు, జర్నలిస్టు చేసిన ఫిర్యాదులు రెండింటిపైనా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని పలువురు కోరుతున్నారు. తప్పు చేసిన వారు ఎవరైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టుపై తప్పుడు కేసు నమోదై ఉంటే దానిని ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ జస్టిస్ మూవ్‌మెంట్ తెలంగాణ రాష్ట్ర యువజన అధ్యక్షుడు జనరల్ కార్యదర్శి) యాదవ్ శివకుమార్ అభినవకాంబ్లెయ్ యూత్ ప్రెసిడెంట్. తదితరులు పాల్గొన్నారు



# ఆసియా క్రీడల విజేతలకు సీఎం విజయ్ భారీ నజరానా

## 4x400 మీటర్ల మిక్స్‌డ్ రిలే రేసులో భారత్‌కు రజత పతకం

## జట్టులో తమిళనాడు అథ్లెట్లు విద్య రామరాజ్, విశాల్

## చెరో రూ. 50 లక్షల నజరానా ప్రకటించిన సీఎం



ఆసియా క్రీడల్లో పతకాలు సాధించి దేశానికి, తమిళనాడు రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన అథ్లెట్లకు ముఖ్యమంత్రి విజయ్ భారీ నగదు ప్రోత్సాహకాలను ప్రకటించారు. క్రీడాకారుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడంలో ప్రభుత్వం ముందుంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. 4x400 మీటర్ల మిక్స్‌డ్ రిలే రేసులో భారత్‌కు రజత పతకం అందించిన జట్టులోని తమిళనాడు అథ్లెట్లు విద్య రామరాజ్, విశాల్‌లకు చెరో రూ. 50 లక్షల నజరానా ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఎక్స్ వేదికగా వెల్లడించింది. వీరికి తమిళనాడు స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అథారిటీ (శాట్)కి చెందిన 'ఎలైట్ స్పోర్ట్స్‌పర్సన్ స్కీమ్' కింద ఈ ఆర్థిక సాయం అందనుంది. ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన భారత మహిళా క్రికెట్ జట్టులోని తమిళనాడు యువ క్రీడాకారిణి జి. కమలినికి విజయ్ రూ. 75 లక్షల నజరానా ప్రకటించిన విషయం తెలిసిందే. "4x400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో రజత పతకం సాధించిన భారత అథ్లెట్లకు శుభాకాంక్షలు. నలుగురు సభ్యులున్న భారత జట్టులో ఇద్దరు తమిళనాడుకు చెందిన క్రీడాకారులు ఉండటం మన రాష్ట్ర క్రీడా రంగానికి గర్వకారణం. విద్య రామరాజ్, విశాల్ సాధించిన ఈ విజయం క్రీడల్లో రాణించాలనుకునే యువతకు గొప్ప స్ఫూర్తినిస్తుంది. భవిష్యత్‌లో వీరిద్దరూ మరిన్ని అంతర్జాతీయ విజయాలు సాధించి తమిళనాడుతో పాటు భారత్‌కు మంచి పేరు తీసుకురావాలి" అని సీఎం విజయ్ ప్రశంసించారు. 4x400 మీటర్ల మిక్స్‌డ్ రిలే విభాగంలో విద్య రామరాజ్, విశాల్, మను, పూవమ్మలతో కూడిన భారత బృందం 3:14.46 సెకన్లలో రేసును పూర్తి చేసి రజతాన్ని కైవసం చేసుకుంది. బహ్రెయిన్ జట్టు 3:12.87 సెకన్ల టైమింగ్‌తో గేమ్స్ రికార్డు నమోదు చేస్తూ స్వర్ణాన్ని గెలుచుకుంది. ఆసియా క్రీడల మిక్స్‌డ్ రిలే విభాగంలో భారత్‌కు ఇది వరుసగా మూడో పతకం కావడం విశేషం. 2018లో స్వర్ణం, 2022లో రజతం గెలిచిన భారత జట్టు, మరోసారి రజత పతకంతో మెరిసింది.

# ముల్తానీ స్పిన్ మాయ.. కుశాగ్ర సెంచరీ.. ఆసీస్-ఏ పై భారత్-ఏ ఘన విజయం

## ఆస్ట్రేలియా-ఏతో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్-ఏ 162 పరుగుల తేడాతో ఘన విజయం

## మ్యాచ్‌లో మొత్తం ఏడు వికెట్లతో రాణించిన షామ్స్ ములానీ

## తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ సాధించిన కుమార్ కుశాగ్రకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'

## కెప్టెన్ దేవదత్ పడిక్కల్ అర్ధశతకంతో రెండో ఇన్నింగ్స్‌లో కీలక పాత్ర

## భారత బౌలర్ల ధాటికి రెండో ఇన్నింగ్స్‌లో 200 పరుగులకే కుప్పకూలిన ఆస్ట్రేలియా-ఏ



ఆస్ట్రేలియా-ఏతో జరిగిన తొలి నాలుగు రోజుల మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు ఆల్ రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. పుదుచ్చేరి సీఏపీ-సీషెమ్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో 162 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ షామ్స్ ములానీ రెండో ఇన్నింగ్స్‌లో మూడు వికెట్లు పడగొట్టి, మ్యాచ్ మొత్తంలో 124 పరుగులిచ్చి 7 వికెట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. 363 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో భాగంగా, చివరి రోజైన శుక్రవారం 55/2 ఓవర్‌నైట్ స్కోరుతో బ్యాటింగ్ ప్రారంభించిన ఆస్ట్రేలియా-ఏ, భారత బౌలర్ల ధాటికి నిలవలేకపోయింది. తొలి గంటలోనే మీడియం పేసర్ అన్షుల్ కంబోజ్, ఓవర్‌నైట్ బ్యాటర్లు నాథన్ మెక్‌స్వీనీ (35), కెప్టెన్ పీటర్ హ్యాండ్స్‌కోంబ్ (16)లను ఔట్ చేసి ఆసీస్‌ను కోలుకోలేని దెబ్బ తీశాడు. ఆ తర్వాత పేసర్ తుషార్ దేశ్‌పాండే వరుస బంతుల్లో జోష్ ఫిలిప్, లియామ్ స్కాట్‌లను పెవిలియన్‌కు పంపి పతనాన్ని శాసించాడు. లంచ్ సమయానికి ఆస్ట్రేలియా-ఏ 185/7 స్కోరుతో కష్టాల్లో పడింది. లంచ్ తర్వాత షామ్స్ ములానీ మిగిలిన వికెట్లను పడగొట్టాడు. ఆసీస్ ఇన్నింగ్స్‌లో ఫెర్గస్ ఓ'నీల్ (47) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. చివరికి ఆస్ట్రేలియా-ఏ 55.1 ఓవర్లలో 200 పరుగులకు ఆలౌట్ అయింది. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో 163 పరుగుల ఆధిక్యం సాధించిన భారత్-ఏ, తమ రెండో ఇన్నింగ్స్‌లో కెప్టెన్ దేవదత్ పడిక్కల్ (59) బాధ్యతాయుతమైన అర్ధశతకంతో రాణించాడు. ఓపెనర్ సాయి సుదర్శన్ (39)తో కలిసి పడిక్కల్ రెండో వికెట్‌కు 68 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. అయితే, పడిక్కల్ ఔటైన తర్వాత భారత్-ఏ అనూహ్యంగా కుప్పకూలింది. చివరి ఆరు వికెట్లను కేవలం 48 పరుగులకే కోల్పోయి 199 పరుగులకు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న కుమార్ కుశాగ్ర (46 నాటౌట్) చివరి వరకు పోరాడాడు. తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతమైన సెంచరీతో భారత్-ఏ భారీ స్కోరుకు పునాది వేసిన కుమార్ కుశాగ్రకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. ఇరు జట్ల మధ్య రెండో మ్యాచ్ సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 2 వరకు ఇదే వేదికపై జరగనుంది. ఆ తర్వాత మూడు వన్డేల సిరీస్ కూడా జరగనుంది.

సంక్షిప్త స్కోర్లు:

భారత్-ఏ: 334 & 199

ఆస్ట్రేలియా-ఏ: 171 & 200 (ఫెర్గస్ ఓ'నీల్ 47; తుషార్ దేశ్‌పాండే 3-14, షామ్స్ ములానీ 3-57)

# అర్జున్‌ను సచిన్‌తో పోల్చడం అన్యాయం.. అతను తనకంటూ సొంత గుర్తింపు తెచ్చుకుంటాడు: వీరేంద్ర సెహ్వాగ్



## అర్జున్ టెండూల్కర్‌ను సచిన్‌తో పోల్చడంపై తీవ్ర అసహనం

## అర్జున్ ఒక ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా రాణిస్తున్నాడని ప్రశంస

## యువ ఆటగాళ్లపై పోలికలతో ఒత్తిడి పెంచవద్దని సూచన

## తన కుమారుడు ఆర్యవీర్ విషయంలోనూ ఇదే వర్తిస్తుందని వ్యాఖ్య

దిగ్గజ క్రికెటర్ల కుమారులను వారి తండ్రులతో పోల్చి చూడటం సరైన పద్ధతి కాదని, ఇది యువ ఆటగాళ్లపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతుందని భారత మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ కుమారుడు అర్జున్ టెండూల్కర్‌ను నిరంతరం సచిన్‌తో పోల్చడంపై అసహనం వ్యక్తం చేశాడు. ఇలాంటి పోలికలు సహజంగానే వచ్చినా, అవి యువకుల కెరీర్‌కు ఏమాత్రం మంచివి కావని స్పష్టం చేశాడు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సెహ్వాగ్ ఈ అంశంపై మాట్లాడాడు. "తండ్రులు ఉన్నత స్థాయిలో రాణించినందువల్ల, వారి పిల్లలను వారితో పోల్చడం మొదలుపెడతారు. కానీ అది సరైన పని కాదు. వారిని ఇతర ఆటగాళ్లతో పోల్చండి, అంతేకానీ తండ్రులతో ఎందుకు పోలుస్తున్నారు? మీడియా, ప్రజల నుంచి వచ్చే ఈ నిరంతర పోలికల వల్ల యువ ఆటగాళ్లు మానసికంగా ఎంతో కుంగిపోతారు" అని సెహ్వాగ్ అన్నాడు. అర్జున్ టెండూల్కర్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ.. "ప్రజలు సచిన్ కుమారుడిని సచిన్‌తో పోలుస్తున్నారు. అది చాలా అన్యాయం. అర్జున్ ఒక ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్. రంజీ ట్రోఫీలో సెంచరీ సాధించి, ఐదు వికెట్ల ప్రదర్శన కూడా చేశాడు. అయినా ఎందుకో ప్రజలు అతడిని సచిన్‌తో పోలుస్తున్నారు. అర్జున్ తనకంటూ సొంత గుర్తింపు తెచ్చుకుంటాడు. తనకు నచ్చిన విధంగా ఆడతాడు. అతను తన తండ్రి అడుగుజాడల్లోనే నడవాల్సిన అవసరం లేదు" అని సెహ్వాగ్ వ్యాఖ్య స్పష్టం చేశాడు. ఇదే విషయాన్ని తన కుమారుడు ఆర్యవీర్ విషయంలోనూ వీరూ ప్రస్తావించాడు. ప్రస్తుతం భారత అండర్-19 జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆర్యవీర్ కెరీర్ ఇప్పుడే ప్రారంభ దశలో ఉందని, తాను ఇప్పటికే ఎంతో సాధించానని గుర్తుచేశాడు. ఈ సమయంలో తన కొడుకును తనతో పోల్చడం కూడా సరికాదని అన్నాడు. యువ క్రికెటర్లను ముందుగా స్వేచ్ఛగా ఆడనివ్వాలని, వారు తమను తాము నిరూపించుకునే అవకాశం కల్పించాలని, ఆ తర్వాతే ఎలాంటి పోలికలైనా తీసుకురావాలని సెహ్వాగ్ హితవు పలికాడు.

# క్రికెట్‌లో సంచలనం.. ఆఫ్ఘనిస్థాన్‌కు షాకిచ్చిన నేపాల్

క్రికెట్‌లో నేపాల్ జట్టు సంచలనం సృష్టించింది. కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో జరిగిన ఆసియా క్రీడల గ్రూప్-ఏ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో పటిష్ఠమైన ఆఫ్ఘనిస్థాన్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలింగ్, బ్యాటింగ్‌లో సమష్టిగా రాణించి ఆఫ్ఘన్ జట్టుకు షాకిచ్చింది. మొదట బౌలర్లు కట్టడి చేయగా, ఆ తర్వాత బ్యాటర్లు బాధ్యతాయుతంగా ఆడి జట్టును గెలిపించారు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్థాన్‌ను నేపాల్ స్పిన్నర్లు కుశాల్ భుర్టెల్, లలిత్ రాజ్‌బంశీ తమ స్పిన్‌తో కట్టిపడేశారు. వీరి ధాటికి ఆఫ్ఘన్ బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. భుర్టెల్ 4 వికెట్లు పడగొట్టగా, రాజ్‌బంశీ కేవలం 13 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీశాడు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ స్వేచ్ఛగా ఆడలేకపోయింది. ఫైసల్ షినోజాదా (30), నజీబుల్లా జద్రాన్ (30) మాత్రమే కాస్త పోరాడటంతో ఆఫ్ఘన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 102 పరుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం 103 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన నేపాల్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. ఓపెనర్లు భుర్టెల్ (0), ఆసిఫ్ షేక్ (2) త్వరగా ఔటయ్యారు. కుశాల్ మల్లా కూడా రనౌట్ కావడంతో నేపాల్ 6.3 ఓవర్లలో 31 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో సుందీప్ జోరా (34), రోహిత్ పౌడెల్ (33 నాటౌట్) బాధ్యతాయుతమైన భాగస్వామ్యం నెలకొల్పారు. వీరిద్దరూ వికెట్ల పతనాన్ని అడ్డుకొని, స్కోరు బోర్డును నెమ్మదిగా ముందుకు నడిపించారు. కీలక సమయంలో సుందీప్ జోరా రనౌట్ అయినా, కెప్టెన్ దీపేంద్ర సింగ్ ఐరీ (15)తో కలిసి రోహిత్ పౌడెల్ జట్టును విజయానికి చేరువ చేశాడు. పౌడెల్ 16, 17 ఓవర్లలో మూడు ఫోర్లు కొట్టి ఒత్తిడి తగ్గించాడు. విజయానికి ఒక్క పరుగు దూరంలో దీపేంద్ర ఔటైనా, గుల్షన్ ఝా సింగిల్ తీసి లాంఛనాన్ని పూర్తి చేశాడు. ఈ విజయంతో నేపాల్ తమ ఖాతా తెరిచింది. గ్రూప్-ఏలో ఆఫ్ఘనిస్థాన్ రెండు మ్యాచ్‌లలో ఒకటి గెలిచి, ఒకటి ఓడినా.. మెరుగైన నెట్ రన్ రేట్ కారణంగా టేబుల్‌లో అగ్రస్థానంలో ఉంది. నేపాల్ తన తదుపరి మ్యాచ్‌లో జపాన్‌తో తలపడనుంది. గ్రూప్‌లో టాప్-2 జట్లు క్వార్టర్ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి



మన దునియా

మన అక్షరం - మన ప్రపంచం

## 'ఎందుకంత దురద' వివాదం.. వీడియో విడుదల చేసిన సంపూర్ణేశ్ బాబు!



**'ది ప్యారడైజ్' సినిమా ప్రమోషన్లలో జర్నలిస్ట్ వ్యాఖ్యలపై దుమారం**

**జర్నలిస్ట్ నాగేంద్ర కుమార్ పై సంపూర్ణేశ్ బాబు అభిమానుల ఆగ్రహం**

**క్షమాపణలు చెప్పిన జర్నలిస్ట్, వివాదంపై స్పందించిన సంపూర్ణేశ్**

**అతడు నాకు సోదరుడి లాంటి వాడు, తప్పుగా అర్థం చేసుకోవద్దన్న నటుడు**

జర్నలిస్ట్ నాగేంద్ర కుమార్ తో చోటుచేసుకున్న ఇంటర్వ్యూ వివాదంపై హీరో సంపూర్ణేశ్ బాబు స్పందించారు. నాగేంద్ర కుమార్ తనకు అత్యంత ఆప్తుడని, తమ మధ్య ఉన్న సాన్నిహిత్యం కారణంగానే ఆ వ్యాఖ్యలు వచ్చాయని ఆయన స్పష్టం చేశారు. అభిమానులు వాటిని తప్పుగా అర్థం చేసుకోవద్దని కోరుతూ ఆయన ఒక వీడియోను విడుదల చేయడంతో ఈ వివాదానికి తెరపడింది.

అసలేం జరిగింది?

సంపూర్ణేశ్ బాబు నటించిన 'ది ప్యారడైజ్' చిత్ర ప్రమోషన్లలో భాగంగా జర్నలిస్ట్ నాగేంద్ర కుమార్ ఒక ఇంటర్వ్యూ నిర్వహించారు. ఆ సందర్భంగా, "మీకు సినీ నేపథ్యం లేదు కదా, మరి పరిశ్రమలోకి ఎందుకొచ్చారు? మీకెందుకంత దురద?" అంటూ నాగేంద్ర కుమార్ ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపాయి. ఒక నటుడిని ఆ విధంగా కించపరచడం సరికాదంటూ నెటిజన్లు, సంపూ అభిమానులు సదరు జర్నలిస్టుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విమర్శలు వెల్లువెత్తడంతో జర్నలిస్ట్ నాగేంద్ర కుమార్ తన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పారు. తాను ఉద్దేశపూర్వకంగా ఆ మాటలు అనలేదని, సంభాషణలో భాగంగా పొరపాటున దొర్లాయని ఆయన వివరణ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సంపూర్ణేశ్ బాబు స్వయంగా ఒక వీడియో ద్వారా క్లారిటీ ఇచ్చారు. "నాగేంద్ర గారు నాకు ఎంతో సన్నిహితుడు. 'హృదయ కాలేయం' చిత్రం నుంచి జర్నలిస్టులందరూ నన్ను ఎంతో ఆదరిస్తున్నారు. అందరూ నన్ను ఒక సోదరుడిలా భావిస్తారు. మా మధ్య ఉన్న చనువుతోనే ఆయన ఆ మాటలు అన్నారు. దయచేసి ఎవరూ వాటిని అన్యథా భావించవద్దు" అని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం సంపూ విడుదల చేసిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## గిదా పద్ధతి రాహుల్?: కేసీఆర్ టోన్‌లో ప్రియదర్శి క్రేజీ రిప్లై

**బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకున్న నాని 'ది ప్యారడైజ్'**

**కేసీఆర్ ను గుర్తు చేసే పాత్రను పోషించిన ప్రియదర్శి**

**'బాపూ.. ఇచ్చి పడేశినావు' అని రాహుల్ ట్వీట్**

నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన 'ది ప్యారడైజ్' చిత్రం మిశ్రమ స్పందనలు అందుకుంటోంది. ఈ సినిమాలో విలక్షణ నటుడు ప్రియదర్శి పోషించిన పూర్తి స్థాయి మాస్ పొలిటికల్ లీడర్ పాత్ర ప్రేక్షకుల నుంచి విశేష ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా 'ఎమ్మెల్యే శంకరన్న'గా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని గుర్తుచేసేలా ఆయన చూపిన హావభావాలు, గెటప్, బాడీ లాంగ్వేజ్ సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ నేపథ్యంలో ప్రియదర్శి అద్భుత నటనపై తోటి నటుడు రాహుల్ రామకృష్ణ సోషల్ మీడియా వేదికగా ప్రశంసల జల్లు కురిపించారు. ప్రియదర్శిని ఉద్దేశించి 'బాపూ.. ఇచ్చి పడేసినావు' అని రాహుల్ ట్వీట్ చేయగా... దానికి ప్రియదర్శి కేసీఆర్ శైలిలోనే అత్యంత సరదాగా బదులిచ్చారు. కేసీఆర్ గతంలో ఓ సమావేశంలో అన్న ఫేమస్ వ్యాఖ్యలను గుర్తుచేస్తూ "ఏమయ్యా రాహుల్.. గిదా పద్ధతి? గొర్రెపిల్లని కోసి దావత్ ఇయ్యాలే" అంటూ రిప్లై ఇచ్చారు. వీరిద్దరి మధ్య సాగిన ఈ ఫన్నీ సంభాషణ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతూ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది.





## వెండితెరపై చందమామలాంటి అందం .. కయాదు లోహర్!

**కన్నడ సినిమాతో ఎంట్రీ ఇచ్చిన కయాదు లోహర్**

**గ్లామరస్ బ్యూటీగా యూత్ లో క్రేజ్**

**తెలుగు నుంచి పలకరించని సక్సెస్ లు**

**కోలీవుడ్ లో పెరుగుతున్న అవకాశాలు**

**టాలీవుడ్ పై కూడా దృష్టిపెట్టిన సుందరి**

వెండితెరపై విరిసిన కలువనే 'కయాదు లోహర్' అనేది కుర్రాళ్లు చెప్పుకునే మాట. తమన్నా తరువాత 'మిల్కీ బ్యూటీ' అనే మాట ఏ హీరోయిన్ విషయంలో వాడొచ్చునా అనే ప్రశ్నకి ఆన్సర్ గా కనిపించే రూపమే కయాదు లోహర్. తమన్నాతో పోటీపడే మేనిఛాయతో ఎంట్రీ ఇచ్చిన ఈ సుందరి, అభిమానులను పెద్ద సంఖ్యలో సంపాదించుకోవడానికి ఎక్కువ సమయం తీసుకోలేదు. చక్కని కనుముక్కుతీరుతో పాటు అందుకు తగిన అభినయంతో ఈ బ్యూటీ ఆకట్టుకుంటూ వెళుతోంది. వరుస సినిమాలతో మరింత బిజీ అవుతోంది. సాధారణంగా ఒక భాషలో బిజీ అయిన తరువాతనే హీరోయిన్స్ మరో భాషలోకి ఎంట్రీ ఇస్తుంటారు. అలా కాకుండా వరుసగా వివిధ భాషల్లో అవకాశాలను సంపాదించుకోవడం చాలా తక్కువ మంది హీరోయిన్స్ విషయంలో జరుగుతూ ఉంటుంది. అలాంటి ఒక అరుదైన ఫీట్ కయాదు లోహర్ కూడా సాధ్యం చేసింది. కన్నడ సినిమాతో తన కెరియర్ ను మొదలుపెట్టిన ఈ చందమామ లాంటి అమ్మాయి, తెలుగు .. తమిళ .. మలయాళ .. మరాఠీ భాషలకు పరిచయం కావడానికి ఎక్కువ సమయం తీసుకోకపోవడం విశేషం. తన కెరియర్ ఆరంభంలోనే తెలుగులో శ్రీవిష్ణుతో 'అల్లూరి' .. విష్వక్సేన్ తో 'ఫంకీ' చేసిన 'కయాదు లోహర్'కి ఆ సినిమాలు సరిగ్గా ఆడక పోవడం వలన సరైన గుర్తింపురాలేదు. ఆ తరువాతనే యూత్ లో ఆమె క్రేజ్ పెరుగుతూ వెళ్లింది. ఇప్పుడు తమిళ .. మలయాళ ప్రాజెక్టులతో ఆమె ఫుల్ బిజీ. ఈ నేపథ్యంలోనే తెలుగులో ఆమె చేసిన మరో సినిమాగా 'ది ప్యారడైజ్' నిన్న థియేటర్లకు వచ్చింది. ఈ సినిమాలో కనిపించినంత సేపు తన అందంతో ఆమె ఆకట్టుకుంది. కాకపోతే ఆమె పాత్రకి సరైన ప్రాధాన్యత లేకపోవడం అభిమానులకు అసంతృప్తిని కలిగించింది. కయాదు గ్లామర్ కి తగిన సరైన ప్రాజెక్టులు .. పాత్రలు పడితే, తెలుగులోను ఆమె బిజీ కావడం ఖాయమనే టాక్ వినిపిస్తోంది. ఆ రోజు త్వరలోనే వస్తుందేమో చూడాలి మరి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cel1 No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com